


సోమవారం 20 జూలై 2026 పేజీలు : 8

# మున్నూరు కాపుల్లో ఐక్యత అవసరం



- మున్నూరు కాపుల అభివృద్ధికి సమిష్టిగా పాటి ఒక్కారు కృషి చేయాలి
- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్
- మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడి మంచిర్యాల పర్యటన
- మంచిర్యాల జిల్లా నాయకులకు, కార్యకర్తలకు రాష్ట్ర అధ్యక్షుడి సూచనలు

# విద్యార్థులు చదువుతో మంచిర్యాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలో తొలి స్థానంలో నిలబెట్టాలి



విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధిస్తూ మంచిర్యాల నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని, విద్యా రంగంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలేజీ రోడ్డులో ఉన్న పద్మనాయక ఫంక్షన్ హాల్లో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

# హై లోడ్ ఓవర్ హై స్పీడ్‌తో రోడ్లు అస్తవ్యస్తం

- అధికట్రాఫిక్ తో పాఠ శాల,విద్యార్థులకు, వృద్ధులకు,వాహన దారులకు,పాదచారు లకు, ఇబ్బందులు
- భారీ వాహనాలకు దుబ్బగూడా బైపాస్ నుండి మళ్ళించాలని జిల్లా కలెక్టర్ కు ప్రజావాణి లో ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు స్పందించని జిల్లా అధికారులు
- తమకు ఎలాంటి సంబంధం లేదని ఆర్ అండ్ బి అధికారులు:
- చిన్న వాహనాదారు లను అధిక ఫైన్ లతో ఇబ్బంది పెట్టే ఆర్టీఓ, అనుమతి లేని అధిక లోడ్లతో వస్తున్న భారీ వాహనాలను:
- గాలికి వదిలేసి తనిఖీ లు చెయ్యకుండా వారి తో డబ్బులు తీసుకుంటున్నారని గ్రామస్తుల ఆరోపణ








# మున్నూరు కాపుల్లో ఐక్యత అవసరం

**మున్నూరు కాపుల అభివృద్ధికి సమిష్టిగా పాటి ఒక్కారు కృషి చేయాలి**

**మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్**

**మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడి మంచిర్యాల పర్యటన**

**మంచిర్యాల జిల్లా నాయకులకు, కార్యకర్తలకు రాష్ట్ర అధ్యక్షుడి సూచనలు**



**మంచిర్యాల, 19, జులై (ప్రజాజ్యోతి):** మున్నూరు కాపు సమాజ అభివృద్ధికి ఐక్యతే శ్రీరామరక్ష అని, వ్యక్తిగత విభేదాలు, గ్రూపు రాజకీయాలను పక్కనబెట్టి రాజకీయాలకు అతీతంగా సమాజ ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా పర్యటన సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, జిల్లా నాయకులు, కార్యకర్తలతో సమావేశమై సంఘ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ముందుగా గాంధీనగర్‌లోని కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర అధ్యక్షుడు అనంతరం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి గాదె సత్యం నివాసానికి చేరుకున్నారు. అక్కడ జిల్లా నాయకులు, మంచిర్యాల పట్టణ నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి గాదె సత్యం నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు, కార్యకర్తలతో రాష్ట్ర అధ్యక్షుడు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో మాట్లాడుతూ సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్, మున్నూరు కాపు సమాజం సామాజిక, విద్యా, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మరింత పురోగతి సాధించాలంటే సంఘటిత శక్తిగా ముందుకు సాగాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా సమాజ ప్రయోజనాల కోసం పనిచేయాలని, ప్రతి గ్రామం, మండలంలో సంఘాన్ని బలోపేతం చేసి యువతను సంఘ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. విద్యార్థుల కోసం వసతి గృహాల ఏర్పాటు, విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల సాధన, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో సంఘ విస్తరణకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా, నియోజకవర్గం, మండల, పట్టణ కమిటీలను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి సంఘ సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టాలని, యువతలో సామాజిక చైతన్యం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని, మున్నూరు కాపు సమాజ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడికి జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అమ్ములపు శ్రీనివాస్, తోట శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు �ċ మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి ఇందూరి తిరుపతి పటేల్, రాష్ట్ర కార్యదర్శి గాదె సత్యం, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఆర్నె సమ్మయ్య పటేల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కాసెట్టి కుమార్, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు పల్లె భూమేష్ పటేల్, జిల్లా గౌరవ అధ్యక్షుడు గొంగోళ్ల శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల శంకర్, దండేపల్లి మండల గౌరవ అధ్యక్షుడు ఇప్ప రమేష్, అరె రాజేందర్‌తో పాటు జిల్లా, పట్టణ నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట శ్రీనివాస్, అమ్ములపు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు �ċ జిల్లా ఇన్‌చార్జి ఇందూరి తిరుపతి పటేల్, జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ పటేల్, రాష్ట్ర కార్యదర్శి గాదె సత్యం, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఆర్నె సమ్మయ్య పటేల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కాసెట్టి కుమార్, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు పల్లె భూమేష్ పటేల్, జిల్లా గౌరవ అధ్యక్షుడు గొంగోళ్ల శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల శంకర్, నగర మేయర్ మధుకర్, ఇప్ప రమేష్, అరె రాజేందర్, తూముల నరేష్, పూదరి తిరుపతి, పెద్దింటి పున్నం చందు, గుర్రం శ్రీనివాస్, ఆకుల తిరుపతి, బోయిన సంపత్‌తో పాటు వివిధ మండలాల మున్నూరు కాపు నాయకులు, కార్యకర్తలు, కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడి మంచిర్యాల పర్యటనతో జిల్లాలో మున్నూరు కాపు సంఘం కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని నాయకులు పేర్కొన్నారు. సమాజ ప్రయోజనాల కోసం ఐక్యంగా పనిచేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా ప్రతినబూనారు.

## మండల కేంద్రంలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు



**సారంగాపూర్, జులై 19,ప్రజా జ్యోతి** సారంగాపూర్ మండలంలో బోనాల పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, తలపై బోనాలు ఎత్తుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ భక్తులు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## ఖానాపూర్లో ఊళ్ళ పోచమ్మ బోనాల పండుగ

**ఊరేగింపుతో మొక్కులు తీసుకున్న గంగపుత్రులు**



**ఖానాపూర్ జూలై 19 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ పట్టణం శ్రీరామ్నగర్ లో గల పురాతన శ్రీ శ్రీ శ్రీ ముత్యాల ఊళ్ల పోచమ్మ బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా గంగపుత్రులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు అమ్మవారికి ప్రత్యేక పూజలు మల్లేశం ఆధ్వర్యంలో జరిపి అలంకరించి భక్తులకు అమ్మవారి దర్శనం కావించి ప్రసాదం అందించారు శ్రీరామ్ నగర్ కు చెందిన కుల సంఘాల సభ్యులు అమ్మవారి మొక్కులను యాటలతో తీర్చుకొని అమ్మ కృపకు పాత్ర అయ్యారు ఘనంగా ఊళ్ల పోచమ్మ పండగ జరిగింది

## ఘనంగా బోనాల జాతర వేడుకలు



**సారంగాపూర్, జులై 19,ప్రజా జ్యోతి** మండలంలోని గ్రామంలో బోనాల జాతర పండుగను గ్రామ సర్పంచ్ కూనేరు భూమన్న, వార్డు సభ్యులు దొడ నర్సయ్య, కూతడి సత్యనారాయణ, భూచ్చన్న, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు, మహిళలు,గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించగా, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## తెలంగాణ రాష్ట్ర స్థానిక మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు పుటం పురుషోత్తం ను, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి పటేల్‌కు తాండూర్‌లో ఘన స్వాగతం లభించింది.



**తాండూర్ జూలై 19 ప్రజాజ్యోతి** కాగజ్‌నగర్‌లో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో వారు తాండూర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని బోయపల్లిలో మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు పుటం పురుషోత్తం ను తాండూర్ ఐబీ లో కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి పటేల్‌ను మండల మున్నూరు కాపు స్థానిక నాయకులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ దర్నీ మధుకర్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావా స్వాతి రమేష్, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మాసాడి శ్రీరాములు, మాసాడి తిరుపతి, కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వేంకటేశం, తాండూర్ ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నవీన్, పడల రవి, చీర్ల రాజేశం, ఇందురీ సత్యం, కటకం తిరుపతి, శ్రీనివాస్, పులగం వెంకటేష్, ఇందురీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా అనుమండ్ల విక్రమ్

**తాండూర్ జులై 19 (ప్రజాజ్యోతి)** మంచిర్యాల జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా తాండూర్ మండల్ కిష్టంపేట గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ విక్రం ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు ,మంచిర్యాల జిల్లా కేంద్రంలో గార్డెన్లో ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచిర్యాల జిల్లా ఇంచార్జ్ మేరుగు జంపన్న జానీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ హాజరై మాట్లాడుతూ ఉప సర్పంచ్ల హక్కుల సాధన కోసం పార్టీలకు కులాలకు మతాలకు అతీతంగా అందరం ఐక్యంగా ఉండి పోరాటాలు చేసి సాధించుకోవాలని అన్నారు. అనంతరం ఉప సర్పంచ్ల ఫోరం మంచిర్యాల జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ ప్రకటించారు.జిల్లా అధ్యక్షులుగా తాండూరు మండలం కిష్టంపేట గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ అనుమండ్ల విక్రమ్ గ,వర్కింగ్ ప్రెసిడెంట్ గాతిరుపతి



రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగాణ శ్రీనివాస్ ప్రవంతి గారు, బొద్దు రవీందర్ కోశాధికారిగా రాజేశ్వరి ప్రధాన కార్యదర్శిగా రవీందర్ గారు మరియు కార్యదర్శిగా రాజుకుమార్ గార్లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కటకం స్వప్న రాష్ట్ర కార్యదర్శులు ఎరుకల పల్లవ, భీమేష్ అసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు దీపక్ మొండేజిల్లాలో వివిధ గ్రామాల ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో మంచిర్యాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలో తొలి స్థానంలో నిలబెట్టాలి

### మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు








**మంచిర్యాల, 19, జులై (ప్రజాజ్యోతి):** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధిస్తూ మంచిర్యాల నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని, విద్యా రంగంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలేజీ రోడ్డులో ఉన్న పద్మనాయక ఫంక్షన్ హాల్లో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు . విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. ఈ దశలో విద్యార్థులు కష్టపడి చదువుకుని తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. జీవితంలో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు ఉన్నతమైన విద్యను అభ్యసించి శాస్త్రవేత్తలు, ఆర్థిక నిపుణులు, వైద్యులు, ఇంజనీర్లు, పరిపాలనాధికారులు, సాంకేతిక రంగ నిపుణులుగా ఎదిగి దేశాభివృద్ధికి తమ వంతు సేవలు అందించాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత ఆశయాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. మంచిర్యాల నియోజకవర్గ విద్యార్థులు ప్రతిభతో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందేలా కృషి చేయాలని, ప్రతి విద్యార్థి విజయం సాధిస్తే కుటుంబంతో పాటు నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రానికి కూడా మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. చదువుతో పాటు మంచి విలువలు, సామాజిక బాధ్యత, దేశభక్తి పెంపొందించుకోవాలని, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని కోరారు. విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీసి ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చూపించే మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. “మంచిగా చదువుకుని తెలంగాణ రాష్ట్రంలోనే మన మంచిర్యాల నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలబెట్టాలి” అని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల యాజమాన్యం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావును శాలువాతో ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పోషకులు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## వర్షాల కోసం భీమన్న దేవునికి జలాభిషేకం

--పాల్గొన్న సర్పంచ్ ఆడేపు శ్రీకాంత్



**నేరడిగొండ, జులై 19 (ప్రజా జ్యోతి):** మండలంలోని వడూర్ గ్రామంలో ఆదివారం ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో భీమన్న దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుత వానాకాలం సీజన్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పంట లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు పడాలని, ప్రకృతి కరుణించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఆడేపు శ్రీకాంత్తో కలిసి ముదిరాజ్ కులస్తులు భీమన్న దేవునికి సాంప్రదాయబద్ధంగా జలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, గ్రామంలోని ప్రజలందరినీ దేవుడు చల్లగా చూడాలని ఈ సందర్భంగా వారు ప్రార్థించారు. సాంప్రదాయ పద్ధతిలో సాగిన ఈ పూజా కార్యక్రమాల్లో ముదిరాజ్ కులస్తులు, గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు మరియు పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంతో చెలగాటం!కార్పొరేషన్ ఆదాయానికి గండి!





**మంచిర్యాలరూరల్ జులై 19(ప్రజాజ్యోతి)** మంచిర్యాల పట్టణంలో అనేక టీ కేఫ్లు,టీస్టాల్లు ట్రేడ్ లైసెన్స్,శానిటేషన్ సర్టిఫికెట్ లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ కు రావాల్సిన ఆదాయానికి గండి పడటమే కాకుండా ప్రజా రోగ్యం కూడా ప్రమాదంలో పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలు విక్రయించే ప్రతి వ్యాపార సంస్థ సంబంధిత ట్రేడ్ లైసెన్స్, అవసరమైన శానిటేషన్ అనుమతులు కలిగి ఉండాలి. పట్టణంలోని పలు టీ కేఫ్లు ఈ నిబంధనలను పట్టించుకోకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో అపరిశుభ్రమైన వాతావరణంలో టీ,తినుబండారాలు తయారు చేసి విక్రయిస్తున్నారని,పరిశుభ్రమైన తాగునీరు, వ్యర్థాల నిర్వహణ,ఆహార భద్రత ప్రమాణాలను పాటించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల వల్ల ప్రజలు అంటువ్యాధులు, ఆహార విషబాధ వంటి ఆరోగ్య సమస్యల కు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ట్రేడ్ లైసెన్స్,శానిటేషన్ సర్టిఫికెట్,ఇతర చట్టబద్ధ అనుమతులు లేని వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని,అలాగే అన్ని ఆహార వ్యాపార సంస్థలు పరిశుభ్రత ప్రమాణాలను తప్పని సరిగా పాటించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే నిర్లక్ష్యానికి అడ్డుకట్ట వేయడంతో పాటు కార్పొరేషన్ ఆదాయాన్ని కాపాడేందుకు సంబంధిత అధికారులు తక్షణమే సమగ్ర తనిఖీలు చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# బొగ్గు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమం అవసరం

**అఖిలభారతీయ కోల్ పెన్షనర్స్ మహాసంఘ్ అధ్యక్షులు రమేష్ బల్లేవార్**

**కనీస పెన్షన్ రూ.10 వేలకు పెంపుతో పాటు పలు కీలక తీర్మానాలు**





**మంచిర్యాల, 19, జూలై (ప్రజాజ్యోతి):** అఖిలభారతీయ కోల్ పెన్ష నర్స్ మహాసంఘ్ (బీఎంఎస్ అనుబంధ యూనియన్) ప్రథమ వార్షిక మహా సభ గోదావరిఖని పట్టణంలోని ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో మహాసంఘ్ అధ్యక్షులు రమేష్ బల్లేవార్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి బలమైన సంఘటిత వేదిక అవసరమని, ఆ బాధ్యత ను బీఎంఎస్ అనుబంధ అఖిలభార తీయ కోల్ పెన్షనర్స్ మహాసం ఘ్ సమర్థవంతంగా నిర్వహిస్తుందని రమేష్ బల్లేవార్ స్పష్టం చేశారు. మహాసభలో ముఖ్య అతిథులుగా కోల్ సెక్టార్ ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి, కోల్ ఇండియా లిమిటెడ్ మాజీ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్, సింగరేణి పెన్షనర్స్ అసోసియేషన్ అడ్వైజర్ పులి రాజారెడ్డి, మంద రమాకాంత్, ఎస్‌సీఎంకేఎస్ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి తదిత రులు పాల్గొన్నారు. అధ్యక్ష ప్రసంగంలో రమేష్ బల్లేవార్ మాట్లాడు తూ, దేశవ్యాప్తంగా బొగ్గు గనుల నుంచి పెన్షన్ పొందుతున్న వారి సంఖ్య 7 లక్షల 23 వేల 949 మందికి చేరిందని తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వాలు, యాజమా న్యాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించాలంటే బలమైన జాతీయ స్థాయి యూనియన్ అవసరమని, అందుకు ప్రతి పెన్షనర్ సంఘ టితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి కొత్త కాపు కొత్తకాపు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుండగా, పెన్షనర్ల సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో సుమారు నాలుగు లక్షల మంది కార్మికులు మాత్రమే పనిచేస్తుండ గా, పెన్షనర్ల సంఖ్య ఎనిమిది లక్షలకు చేరువైందన్నారు. ఈ నేపథ్యంలో కోల్ పెన్షన్ పథకాన్ని దీర్ఘకాలికంగా రక్షించే చర్యలపై ప్రభుత్వం, యాజమాన్యం, కార్మిక సంఘాలు తీవ్రంగా ఆలోచిస్తు న్నాయని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బొగ్గుగని కార్మికుల పెన్షన్ హక్కులను కాపాడుతామని, కనీస పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచేందుకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఆర్ఎంఎస్ పథకం సమర్థవంతంగా అమలయ్యేలా కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కోల్ ఇండియా మాజీ సీఎండీ ప్రసాద్ మాట్లాడుతూ, భవిష్యత్తులో బొగ్గు పరిశ్రమ ఎదుర్కొనే సవా ళ్లు, బొగ్గు ఆధారిత ఉప ఉత్పత్తులు, ఖనిజ వనరుల వినియోగంపై విస్తృతంగా వివరించారు. సింగరేణి పెన్షనర్స్ అసోసియేషన్ అడ్వైజర్ పులి రాజారెడ్డి మాట్లాడుతూ తక్కువ పెన్షన్ కారణంగా వేలాది మంది విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సీపీఆర్ఎంఎస్ వైద్య ఖర్చుల పరిమితిని పెంచాలని, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ మహాసభలో పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కనీస పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచడం, పెన్షనర్ల కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయడం, వితంతు పెన్షన్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించడం, సీపీఆర్ఎంఎస్ కార్డు లేని పెన్షనర్లకు కంపెనీ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యసేవలు కల్పించడం, ప్రతి సంస్థలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేయడం, సీపీఆర్ఎంఎస్ కార్డుల కోసం మరోసారి అవకాశం కల్పించడం, క్రానిక్, క్రిటికల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి మూడు నెలల మందులను ఒకేసారి అందించడం, అవసరమైతే ప్రైవేట్ ఫార్మసీల ద్వారా మందులు కొనుగోలు చేసిన వారికి రూ.25 వేల వరకు చెల్లించడం, మెడికల్ బిల్లులను 45 రోజుల్లో క్లియర్ చేయడం, సీపీఆర్ఎంఎస్ వైద్య పరిమితిని రూ.15 లక్షలకు పెంచడం వంటి అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ మహాసభలో గోదావరిఖని సీఎంపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ భరత్ కుమార్, డా. సురేంద్ర నెహ్రూ, ఎస్‌సీఎంకేఎస్ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామితో పాటు వివిధ బొగ్గు గనుల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు. సమావేశం అనంతరం నాయకులు మాట్లాడుతూ, ఈ మహాసభ బొగ్గు పరిశ్రమ విశ్రాంత ఉద్యోగుల్లో నూతన విశ్వాసాన్ని నింపిందని, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో మరింత బలమైన ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

**నూతన జాతీయ కమిటీ.....**

ఈ సందర్భంగా కోల్ సెక్టార్ ఇన్‌చార్జి కె. కొత్తకాపు లక్ష్మారెడ్డి నూతన జాతీయ కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా పులి రాజారెడ్డి (సింగరేణి), కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీనివాసరావు (మహానది కోల్ ఫీల్డ్స్), ఉపాధ్యక్షులుగా ముబారక్ హుస్సేన్, జనరల్ అన్సారి, ప్రధాన కార్యదర్శిగా రమేష్ బల్లేవార్, ఉప ప్రధాన కార్యదర్శిగా ఆర్.ఎస్. సింగ్, సంఘటనా కార్యదర్శులుగా మంద రమాకాంత్, నారాయణరావు (సింగరేణి), రవీందర్, మూల రాజ్‌కుమార్, సురేష్ రాథోడ్, భూషణ్ తదితరులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా లట్టి జగన్మోహన్ (కొత్తగూడెం ఏరియా) సహ పలువురిని నియమించారు.

## ఆసిఫాబాద్ సాంఘిక సంక్షేమ వసతి గృహం శిథిలం

**కొత్త భవనం మంజూరు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం విజ్ఞప్తి ఒకే గదిలో 70 మంది విద్యార్థులు**

**అవస్థలు పడుతున్న సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులు**



**ఆసిఫాబాద్ జూలై 19 (ప్రజా జ్యోతి** జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ తెలిపారు. ఆదివారం ఆయన వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం పూర్తిగా పాడైపోయిందని, ఒకే గదిలో 70 మంది విద్యార్థులు ఇరుకుగా ఉండాల్సి వస్తుందని చెప్పారు. వర్షం వస్తే గదుల్లోకి నీరు కారడంతో రాత్రంతా నిద్రలేకుండా గడుపుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా పెట్టెలు ఇవ్వలేదని, ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు దాటినా ఇప్పటివరకు పుస్తకాలు అందలేదని, ఆట సామగ్రి కూడా లేదని విద్యార్థులు తెలిపారన్నారు.వెంటనే ప్రభుత్వం స్పందించి కొత్త భవనాన్ని మంజూరు చేయాలని, మరుగుదొడ్లను బాగు చేయడంతో పాటు చుట్టూ గోడ నిర్మించాలని, విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపా యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకుడు మల్లేష్, వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రేఖను పరామర్శించిన ఆదివాసి కాంగ్రెస్ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్

**ఖానాపూర్ జూలై 19 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖ నాయక్ ఇటీవల అనారోగ్యంతో కాలుకు చికిత్స చేయించుకున్నారు ఈ సందర్భంగా ఆదివాసి కాంగ్రెస్ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణవత గోవింద నాయక్ ఆదివారం పరామర్శిం చారు ఈ కార్యక్రమంలో బన్సీలాల్ రాథోడ్ దుర్గయ్య తదితరులు ఉన్నారు

## ఓటర్ల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆరెపల్లి మోహన్, ఆత్రం సుగుణక్క**





**ఆసిఫాబాద్, జూలై 19 (ప్రజా జ్యోతి** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, అబ్జర్వర్లు అప్రమత్తంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్లమెంట్ అబ్జర్వర్ ఆరెపల్లి మోహన్ అన్నారు. ఆదివారం ఆసిఫాబాద్ పట్టణంలోని రోజ్ గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం, ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే పార్టీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటు హక్కును పరిరక్షించడం ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగమని పేర్కొన్నారు.డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ, ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు జిల్లాల్లోనే ఉండి ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రజల మధ్య పనిచేయాలని సూచించారని తెలిపారు. తాను కూడా జిల్లాలోనే ఉండి ప్రతిరోజూ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. సమన్వయంతో పనిచేసి ఓటర్ల హక్కులను పరిరక్షించా లని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన బీఎల్ఏలను రాహుల్ గాంధీని కలిసేలా అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.సమావేశంలో ఆసిఫాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కూద్మేత విశ్వనాథ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సిడం గణపతి, డీసీసీ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎస్ఐఆర్ అబ్జర్వర్లు, సూపర్వైజర్లు, బీఎల్ఏలు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా బాక్సింగ్ సెంటర్ అభివృద్ధికి సహకరిస్తాం

**ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**

**బాక్సింగ్ హాల్, పరికరాల భద్రత కోసం గదుల నిర్మాణానికి హామీ**



**మంచిర్యాల, 19, జులై (ప్రజాజ్యోతి):** మంచిర్యాలలోని ఖేలో ఇండియా బాక్సింగ్ సెంటర్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యేను ఖేలో ఇండియా బాక్సింగ్ సెంటర్ జిల్లా కోచ్ సీహెచ్. రాజేష్ ఆధ్వర్యంలో బాక్సింగ్ క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిసి సెంటర్‌కు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బాక్సింగ్ శిక్షణ కోసం వినియోగిస్తున్న హాల్‌తో పాటు క్రీడా పరికరాలను భద్రపరచుకునేందుకు తగిన గదుల నిర్మాణం అవసరమని కోచ్, క్రీడాకారులు ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, బాక్సింగ్ హాల్‌తో పాటు క్రీడా పరికరాల భద్రత కోసం అవసరమైన గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత రెండున్నర సంవత్సరాలుగా రాష్ట్ర, జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చి పలు పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించారు. అలాగే వారిని ఉన్నత స్థాయికి తీర్చిదిద్దుతున్న జిల్లా కోచ్ సీహెచ్. రాజేష్ సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియా బాక్సింగ్ సెంటర్ ప్రతినిధులు, క్రీడాకారులు తమ సమస్యలపై వెంటనే స్పందించి అభివృద్ధికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో క్రీడల అభివృద్ధికి ఆయన అందిస్తున్న ప్రోత్సాహం యువ క్రీడాకారులకు మరింత ఉత్సాహాన్నిస్తుందని తెలిపారు.

# కబడ్డీలో ప్రతిభావంతులైన బాలురకు అకాడమీ ద్వారా ఉజ్వల భవిష్యత్

**22న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు**

**రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఈ. రామచందర్**




**మంచిర్యాల, 19, జులై (ప్రజాజ్యోతి):**కబడ్డీ క్రీడలో ప్రతిభ కలిగిన బాలురను గుర్తించి ఉన్నత స్థాయికి తీర్చిదిద్దేందుకు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రత్యేకంగా అకాడమీ ఎంపిక పోటీలను నిర్వహిస్తోందని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఈ. రామచందర్ తెలిపారు.మంచిర్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22-07-2026న నస్పూర్ కాలనీలోని సాధన స్పోర్ట్స్ డిఫెన్స్ అకాడమీలో ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మహబూబ్‌నగర్ జిల్లా డీఎస్ఏ గ్రౌండ్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్ ఎంపిక పోటీల్లో పాల్గొనే అవకాశం పొందుతారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పూర్తిగా ఉచితంగా వసతి, భోజనం, విద్యాభ్యాసం, ఆధునిక శిక్షణ కల్పించి జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు అన్ని ఏర్పాట్లు ఉంటాయని ఈ. రామచందర్ తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే బాలురు 30 జూన్ 2010 నుంచి 1 జూలై 2012 మధ్య జన్మించి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికేట్‌తో పాటు రూ.200 నమోదు రుసుము తీసుకురావాలని సూచించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికల రోజు మంచిర్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె. కార్తీక్కు రిపోర్టు చేసి ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఈ. రామచందర్ పిలుపునిచ్చారు.

# రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవే నా ధ్యేయం

**నియోజకవర్గం లోని 125 మంది లబ్ధిదారులకు 50లక్షల**

**58 వేల రూపాయల సి. ఎం.ఆర్ ఎఫ్. చెక్కులను అందించిన ఎమ్మెల్యే**

**రాజకీయాలకతీతంగా ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే రామారావు పటేల్ స్పష్టం చేశారు**



**భైంసా / కుంటాల జూలై 19 ( ప్రజాజ్యోతి)** భైంసా లోని ఎస్. ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ లో 125మంది లబ్ధిదారులకు 55 లక్షల 58 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.. ప్రజలకు ఆరోగ్య పరంగా ఇబ్బందులు తలెత్తితే కొంత సహాయం చేయాలన్న ఉద్దేశంతో తన కార్యాలయంనే ముఖ్యమంత్రి సహాయ నిధి కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా ఇద్దరు పి. ఏలను నియమించి గతంలో కంటే ఎక్కువగా రెండున్నర సంవత్సరాల్లో 5000 మందికి ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయంగా ముందుకు సాగుతానని ప్రతి గ్రామంలో సిసి రోడ్లు డ్రైనేజీలు, మహిళా సమైక్య భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర అమ్మ వారి ఆలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి 325 కోట్లు కేటాయించడం అదృష్టమేనన్నారు. అదేవిధంగా ఆలయ నిర్మాణం కోసం దాత 30 కోట్లు ఇవ్వడం శుభ సూచకమన్నారు. అంతకు ముందు మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్త్రాత్రి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, కుంటాల మండల నాయకులు బివి రమణారావ్ ,, కుంటాల సర్పంచ్ గజేందర్, భైంసా పట్టణ, మండల అధ్యక్షులు రావుల రాము, సిరం సుష్మరెడ్డి, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుపోతుల మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధికంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించిన ఘనత ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ దే నన్నారు.. నియోజకవర్గం లో పెద్ద మొత్తంలో అభివృద్ధి కి నిధులు తెస్తున్న ఘనత ఆయనదే నన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బి. గంగాధర్, సర్పంచులు, నాయకులు, బిజెపి బాధ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధిత యువకుడికి సుర్ధాపూర్ యూత్ చేయూత

**తిరుపతి చికిత్సకు రూ.17,442 ఆర్థిక సాయం**

**మానవత్వం చాటుకున్న సుర్ధాపూర్ యువత**



**కేరమరి జులై 19 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి తేజీకూడ గ్రామానికి చెందిన అదే తిరుపతి (19), తండ్రి అదే దిలీప్, ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న నేపథ్యంలో సుర్ధాపూర్ యూత్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ నెల 11వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో నేషనల్ హైవే పక్కన ఉన్న నూతన హెచ్‌పీ పెట్రోల్ బంక్ (ఆయిల్ మిల్లు) సమీపంలో ద్విచక్ర వాహనం జారి పడటంతో తిరుపతికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం కరీంనగర్‌లోని శ్రీ లక్ష్మీ నరసింహా ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. చికిత్సకు సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన తిరుపతి చికిత్సకు తోడ్పాటుగా సుర్ధాపూర్ యూత్ సభ్యులు రూ.17,442 సేకరించి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మరింత మంది దాతలు ముందుకు వచ్చి యువకుడి చికిత్సకు ఆర్థిక సహాయం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# అడవి బిడ్డలపై ఫారెస్ట్ అధికారుల వేధింపులు ఆపాలి: ఆదివాసీల డిమాండ్



**నేరడిగొండ, జూలై 19( ప్రజాజ్యోతి):** ఆదివాసీల మనుగడ, హక్కుల రక్షణ మరియు 9 తెగల అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా ఆదివారం లఖంపూర్ (జి) రాయి సెంటర్ ఆధ్వర్యంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేరడిగొండ మండల పరిధిలోని 32 గ్రామాల పటేళ్లు, ఆదివాసీ సర్పంచులు, మాజీ సర్పంచులు, ఉద్యోగులు మరియు ఆదివాసీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా రాయి సెంటర్ ప్రతినిధులు మరియు ఆదివాసీ పెద్దలు మాట్లాడుతూ.. తరతరాలుగా అడవిని నమ్ముకుని, భూమి కోసం, భుక్తి కోసం పోరాడుతూ జీవిస్తున్న అమాయక ఆదివాసులను ఫారెస్ట్ అధికారులు భయభ్రాంతులకు గురిచేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పీచర గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్, తిమ్మాపూర్ గ్రామాలను కావ్వాల్ టైగర్ రిజర్వ్ జోన్‌లో చేర్చడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఇక్కడే నివాసముంటున్న ఆదివాసీలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని హితవు పలికారు. ఆదివాసీ గ్రామాలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం, జాతి మనుగడ కోసం మనమందరం ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల పరిధిలోని పలు గ్రామాల పటేళ్లు, ఆదివాసీ ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యోగులు మరియు ఆదివాసీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కెరమేరి నూతన ఎస్ఐగా ఏ. శ్రీకాంత్ బాధ్యతలు

**చట్టాన్ని కాపాడుతూ సేవలు అందిస్తా - ఎస్ఐ శ్రీకాంత్**



**కెరమేరి జూలై 19 ప్రజా జ్యోతి** కెరమేరి పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా ఏ. శ్రీకాంత్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాన్ని గౌరవిస్తూ, ప్రజలకు మరింత చేరువగా ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని, మహిళలు, చిన్నారుల భద్రత, గంజాయి, అక్రమ మద్యం అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ప్రజలు ఏ చిన్న సమస్య ఉన్నా నేరుగా తనను కలవాలని, పోలీస్ శాఖకు ప్రజల సహకారం అవసరమని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునికి సన్మానం



**లక్ష్మణ చాంద, జూలై 19 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఇటీవల కోండ్ర నరేష్ రెడ్డిని నియమించిన సందర్భంగా లక్ష్మణ చాంద ప్రెస్ క్లబ్ పాత్రికేయులు ఆదివారం రోజున ఆయనను వారి నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి పూల గుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జడ్డి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జడ్డి మహేష్, పాత్రికేయులు గుడిసె రాజేందర్, గంగాధర్, వెంకటేశ్వర రాజు, ప్రసాద్, రాజా గౌడ్, నరేష్, ఈశ్వర్, ముత్యం, రాజేంద్ర ప్రసాద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్యాల్ లో వన మహోత్సవం



**లక్ష్మణ చాంద, జూలై 19 (ప్రజా జ్యోతి)** మండలం లోని వడ్యాల్ గ్రామంలో ఆదివారం రోజున వన మహోత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సై శ్రావణి గ్రామ సర్పంచ్ పసుపుల నరేష్ తో పాటు గ్రామస్తులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజ్‌వీల్ ట్రాక్టర్లను రోడ్డుపై నడప కుండా తరలించేందుకు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసిన ట్రాక్టర్స్ అసోసియేషన్‌ను అభినందించారు. దీంతో రోడ్లు దెబ్బ తిన కుండా ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు. అలాగే గ్రామంలో ఎ సీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామస్తులకు సూచించారు. వడ్యాల్‌ను ఆదర్శంగా తీసుకుని ఇతర గ్రామాలు కూడా ఈ విధానాన్ని పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పిరమిడ్ శక్తితో ఆధ్యాత్మిక వికాసం

**ప్రపంచ శాంతి, వ్యక్తిత్వ వికాసానికి పత్రీజీ చూపిన మార్గం "బ్రహ్మర్షి పత్రీజీ ది కంప్లీట్ మ్యాన్" డాక్యుమెంటరీకి విశేష ఆదరణ**

**ప్రపంచవ్యాప్తంగా ఒకేరోజు 270 థియేటర్లలో ఈ డాక్యుమెంటరీని ప్రదర్శన**




**మంచిర్యాల, 19, జూలై (ప్రజాజ్యోతి):** ప్రపంచవ్యాప్తంగా ధ్యాన ఉద్యమాన్ని విస్తరింపి, లక్షలాది మందికి ఆధ్యాత్మిక చైతన్యం కల్పించిన పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పత్రీజీ జీవిత విశేషాలు, ఆయన బోధనలు, సేవా కార్యక్రమాలు, ప్రపంచ శాంతికి చేసిన కృషిని ప్రతిబింబించే "బ్రహ్మర్షి పత్రీజీ ది కంప్లీట్ మ్యాన్" డాక్యుమెంటరీ చిత్రాన్ని ఆదివారం మంచిర్యాల పట్టణంలోని శ్రీనివాస థియేటర్‌లో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్, మంచిర్యాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒకరోజు మాత్రమే ప్రదర్శించారు. ఈ చిత్రాన్ని పెద్ద సంఖ్యలో ధ్యాన సాధకులు, ఆధ్యాత్మికవేత్తలు, ప్రజలు వీక్షించి ప్రశంసించారు. ఈ సందర్భంగా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ అధ్యక్షులు భాస్కర్ రాజు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి 270 థియేటర్లలో ఈ డాక్యుమెంటరీని ప్రదర్శించడం పత్రీజీ ఆలోచనలకు లభిస్తున్న విశేష ఆదరణకు నిదర్శనమన్నారు. ధ్యానం, శాఖాహారం, పిరమిడ్ శక్తి, ఆధ్యాత్మిక విజ్ఞానం, ప్రపంచ శాంతి వంటి అంశాలను ప్రజలకు చేరవేయడమే ఈ చిత్రం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. బ్రహ్మర్షి పత్రీజీ జీవితమంతా "ధ్యానం ప్రతి మనిషి జన్మహక్కు" అనే భావనతో సాగిందన్నారు. ధ్యానం ద్వారా ఒత్తిడి, ఆందోళన, కోపం, భయం వంటి ప్రతికూల భావాలు తొలగి మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశారని అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు, వృద్ధులు ఇలా ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన, ఆనందమయమైన జీవితాన్ని గడపవచ్చని పత్రీజీ సందేశమని వివరించారు. శాఖాహార జీవన విధానం మనిషి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి ఎంతగానో దోహదపడుతుందని పత్రీజీ ఎల్లప్పుడూ బోధించారని తెలిపారు. హింసారహిత జీవన విధానం, ప్రకృతి పరిరక్షణ, జంతు సంరక్షణ, సాత్విక ఆహారం ద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని ఆయన విశ్వసించారని తెలిపారు . పిరమిడ్ నిర్మాణాల ప్రత్యేకతను ప్రపంచానికి పరిచయం చేసిన వారిలో పత్రీజీ ప్రముఖులని భాస్కర్ రాజు పేర్కొన్నారు. పిరమిడ్‌లో ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత పెరగడం, అంతరంగ ప్రశాంతత లభించడం, ఆధ్యాత్మిక సాధన సులభమవుతుందని ఆయన వివరించారు. ఈ భావనతో దేశ విదేశాల్లో వందలాది పిరమిడ్ ధ్యాన కేంద్రాల ఏర్పాటుకు పత్రీజీ స్ఫూర్తినిచ్చారన్నారు. బ్రహ్మర్షి పత్రీజీ వేలాది ధ్యాన శిబిరాలు నిర్వహించి, లక్షలాది మందిని ధ్యాన మార్గంలో నడిపించారని, కుల, మత, జాతి, దేశ భేదాలకు అతీతంగా "ఒకే ప్రపంచం ఒకే కుటుంబం" అనే సందేశాన్ని అందించారని అన్నారు. ప్రపంచ శాంతి కోసం ధ్యానం అత్యంత ప్రభావవంతమైన సాధనమని ఆయన నిరూపించారని వివరించారు .డాక్యుమెంటరీని వీక్షించిన ప్రేక్షకులు మాట్లాడుతూ, పత్రీజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను ఈ చిత్రం ఎంతో చక్కగా వివరించిందన్నారు. ఇటువంటి విలువలను పెంపొందించే డాక్యుమెంటరీ చిత్రాలు మరిన్ని రూపొందించి ప్రజలకు అందించాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ అధ్యక్షులు భాస్కర్ రాజు, ప్రధాన కార్యదర్శి ఆరె మల్లేష్, ఏ. గంగన్న, వైస్ ప్రెసిడెంట్ కొట్టే శశికళ, ట్రెజరర్ శైలజ రామచంద్రన్, సభ్యులు నరేందర్, అనురాధ, రంజిత్ కుమార్, ఏ గంగన్న తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## 21న మంచిర్యాలకు కేటీఆర్ రాక....

**ప్రభుత్వ నిర్లక్ష్యంతో మృతి చెందిన రైతు కుటుంబాలకు రూ.20 లక్షల ఆర్థిక సాయం**

**ఎస్ఐఆర్‌పై తప్పుడు లెక్కలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు**

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజయ్ కుమార్**



**మంచిర్యాల, 19, జూలై (ప్రజాజ్యోతి):** ఈ నెల 21న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంచిర్యాల జిల్లాలో పర్యటించనున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజయ్ కుమార్ తెలిపారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21న లక్షెట్టిపేట మండలంలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో భారీ రైతు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు, వ్యవసాయ రంగ పరిస్థితులపై రైతులతో చర్చించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల్లో మృతి చెందిన నలుగురు రైతుల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ తరఫున మొత్తం రూ.20 లక్షల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు విజయ్ కుమార్ తెలిపారు. రైతు కుటుంబాలకు అండగా నిలవడం తమ పార్టీ బాధ్యతగా భావిస్తోందని, కష్టకాలంలో వారికి భరోసా కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రభుత్వం, అధికారులు తప్పుడు లెక్కలు చూపుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎన్యూమరేషన్ పత్రాలను 100 శాతం పంపిణీ చేశామని అధికారులు ప్రకటించడం పూర్తిగా అవాస్తవమని విమర్శించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ప్రతి ఇంటికి చేరుకొని ఎన్యూమరేషన్ పత్రాలను అందజేయాలని ఆయన కోరారు. తప్పుడు లెక్కలు చూపించి ప్రక్రియ పూర్తయిందని చెప్పడం వల్ల అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు పంపిణీ చేశారు, ఎన్ని తిరిగి స్వీకరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, అసలు ప్రక్రియ ఎంతవరకు పూర్తయిందనే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని అధికారులను విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా తప్పుడు గణాంకాలు విడుదల చేయడం మానుకోవాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు తలెత్తకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే. సురేందర్ రెడ్డి, ఏరియా వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ

**బోథ్, జూలై 19 (ప్రజా జ్యోతి)** బోథ్ మండలం కనుగుట్ట గ్రామంలో గత 20 సంవత్సరాలుగా భక్తుల ఆరాధన కేంద్రంగా కొనసాగుతున్న శబరిమాత ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని నెల రోజులపాటు నిర్వహించనున్న అఖండ జ్యోతి మహోత్సవానికి భక్తిశ్రద్ధలతో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శబరిమాత ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు . నరేష్ జాదవ్ కి ఆలయ కమిటీ మెంబర్స్ గ్రామ ప్రజలు బోథ్ మండల కాంగ్రెస్ శ్రేణులు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. శబరి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ , బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ ఆలయ అభివృద్ధిలో భాగంగా సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నరేష్ జాదవ్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. శబరిమాత ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల ఐక్యత, సహకారంతో ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు అలాగే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఏమ్ సి చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ ఆత్మ చైర్మన్ రాజు యాదవ్ ,సర్పంచుల సంఘం అధ్యక్షులు అసిఫ్ ఖాన్,అధికార ప్రతినిధి పసుల చంటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రఫుల్ రెడ్డి,రాష్ట్రకాంగ్రెస్ పార్టీరాజ సెల్





ఉపాధ్యక్షులు మహేందర్ మండల కన్వీనర్ లు బోజన్న, గాజుల పోతన్న, ఏలేటి రాజశేఖర్ , ఆత్మ డైరెక్టర్ గడ్డల నారాయణ , శబరి మాత కమిటీ సభ్యులు భోజన్న కనుగుట్ట సర్పంచ్ ఆకుల అనిత రాజేందర్ ,దౌలత్ రావు, మాజీ సర్పంచ్ మల్లేష్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి,మార్కెట్ కమిటీ సభ్యులు జంగాల బోజన్న, మునవ్వర్ సోమన్న, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి, అనీష్ ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు అరుణ్, పన్నాల శమేందర్ రెడ్డి, ఉమేష్, అబ్రార్, మహమ్మద్ అబుబు సాయన్న ఆచ్యుతానందరెడ్డి, బీమా బుచన్న,రవి,రహంతుల్లా, శంషు, వార్డు సభ్యులు షేక్ షాకీర్,శబరిమాత ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు.

# అవినీతి అక్రమాలకు ఆజ్యం పోస్తున్న జిసిసి డివిజన్ మేనేజర్ పై చర్యలు తీసుకోవాలి




తుడుం దెబ్బ రాష్ట్ర అధ్య క్షుడు గోడం గణేష్

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 19, (ప్రజా జ్యోతి)**గిరిజన సహకార సంస్థ (జి సిసి) డివిజనల్ మేనేజర్ గు డిమల్ల సందీప్ కుమార్ (ఇ న్చార్జ్ డివిజనల్ మేనేజర్, హార్టీకల్చర్) ని వెంటనే విధుల నుండి తొలగించి, తగిన శాఖాపరమైన విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణే ష్ డిమాండ్ చేశారు. ఆదివారం పలువురు తుడుం దెబ్బ నాయకులతో కలిసి మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తూ అవినీతి అక్ర మాలకు పాల్పడుతున్నారని. ఆయన వెంటనే విధుల నుంచి తప్పించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్ర కారం గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాల్సి ఉంది కానీ, ఇక్కడ నాలుగు జిల్లాలకు ఇన్ చార్జ్‌గా వ్యవహరిస్తున్న గిరిజన సహకార సంస్థ (జిసిసి) డివిజనల్ మేనేజర్ గుడి మల్ల సందీప్ కుమార్,ఒక ఐ ఏ యస్, ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీ సర్ కళ్ళు గప్పి టెండర్స్ ప్రొసీడింగ్స్ స్వయంగా త యారు చేసి నమ్మించి సంతకాలు తీసుకొని తీవ్ర అక్ర మాలకు పాల్పడుతున్నారని అన్నారు. నాణ్యత లేని శాయం కారం పొడి వంటి వ స్తువులను టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత, నిబం ధనలకు విరుద్ధంగా ప్రొసీడింగ్ కాపీలలో చేర్చారని ఆయన ఆరోపించారు. తమ స్వలాభం కోసం ఆయా వస్తువులను ప్రొసీడింగ్స్ జా బితాలో చేర్చి, ఉన్నతాధి కారులను తప్పుదోవ పట్టిం




చి, వారి ద్వారా తెలి యకుండానే సంతకా లు చేయించు కున్నా రని పేర్కొన్నారు. టెం డర్ నిబంధనల ఉల్లంఘన, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఒకవేళ సదరు వస్తువు లు టెండర్ పరిధిలో ఉన్నట్లయితే, ఆ టెండ ర్ ఎవరికి దక్కిందో వారి వద్ద నుంచే సరు కులను సేకరించాల్సి ఉంటుందని అలా కాకుండా, సదరు అధికారి స్వలాభం ఆశించి ప్రైవేటు కాంట్రాక్టర్లతో (గుత్తేదారులతో) కుమ్మక్కై, అతి తక్కువ ధరకు దొరికే, నాణ్యత లేని కారం పొడిని సరఫరా చేస్తున్నారని అన్నారు. దీనివల్ల అమాయకులై న గిరిజన విద్యార్థుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు. గిరిజన విద్యార్థుల భవిష్య త్తును, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, అవినీతికి పాల్పడిన సదరు జీసీసీ డివిజ నల్ మేనేజర్ పై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి, ఆయనను విధుల నుండి తొలగించాలని (సస్పెండ్ చేయాలని) కోరారు. ఈ సమావేశంలో గొడం గణేష్ (రాష్ట్ర అధ్యక్షులు, తుడుం దెబ్బ) తో పాటు వెట్టి మనో జ్ రాష్ట్ర నాయకులు అర్క శేషరావు తదితరులు పాల్గొన్నారు. జిసిసి డివిజనల్ మేనేజర్ పై శాఖ పరమైన చర్యలు తీసుకొని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దుర్గం సందీప్

అంబేద్కర్ ఆశయాల కోసం పనిచేస్తా



**ఆసిఫాబాద్ జులై 19 ప్రజా జ్యోతి** నర్సింగి యందు సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన వాంకిడి మండల కేంద్రానికి చెందిన మార్షల్ దుర్గం సందీప్ ను తెలంగాణ రాష్ట్ర సమతా సైనిక్ దళ్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించిన మాతృ సంస్థ అయిన సమతా సైనిక్ దళ్ ను బలోపేతం చేయడానికి, బాబాసాహెబ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన జాతీయ ఉపాధ్యక్షులు మార్షల్ శ్యామ్ మనోహర్ దాసరి, రాష్ట్ర అధ్యక్షులు మార్షల్ రవీంద్ర బౌద్ధ్ లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## బీపీఎల్ సీజన్-10 విజేతగా కడ్తాల్ జట్టు.

ఫైనల్లో కూచన్‌పల్లిపై ఘన విజయం..

యువతలో క్రీడాస్ఫూర్తి పెంపే లక్ష్యమన్న నిర్వాహకులు.



**సోన్, జూలై 19(ప్రజా జ్యోతి):** సోన్ మండలం న్యూ బొప్పారం గ్రామంలో నిర్వహించిన బొప్పారం ప్రీమియర్ లీగ్ (బీపీఎల్) సీజన్–10 క్రికెట్ టోర్నమెంట్‌కు ఆదివారం ఘనంగా తెరపడింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో కడ్తాల్ జట్టు అద్భుత ఆటతీరుతో కూచన్‌పల్లి జట్టును ఓడించి విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన కడ్తాల్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన కూచన్‌పల్లి జట్టు కడ్తాల్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌ను ఎదుర్కోలేక 8 వికెట్లు కోల్పోయి 85 పరుగులకే పరిమితమైంది. దీంతో కడ్తాల్ జట్టు 35 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి బీపీఎల్ సీజన్–10 ట్రోఫీని సొంతం చేసుకుంది. మ్యాచ్ అనంతరం విజేత జట్టుకు ట్రోఫీతో పాటు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సుధీర్ కు మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు లభించగా, బర్మ అరవింద్ బెస్ట్ బ్యాట్స్‌మన్, ప్రశాంత్ బెస్ట్ బౌలర్ గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడలు, చదువుపై దృష్టి సారించేలా ఐపీఎల్ తరహాలో ప్రతి సంవత్సరం బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు.

# హత్య కేసులో నిందుతులు అరెస్ట్, రిమాండ్ కి తరలింపు

**సారంగాపూర్, జూలై 19 :, ప్రజా జ్యోతి** నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు వివరాలు వెల్లడించిన నిర్మల్ డిఎస్పీ పి.శ్రీనివాస్

**నిందుతుని వివరాలు.**

1.శివరాత్రి ధర్మరాజు, తండ్రి: పోశెట్టి, వయస్సు: 19 సంవత్సరాలు, కులం: వడ్డెర, నివాసం: సారంగాపూర్, నిర్మల్ జిల్లా.

2. షేక్ అహ్మద్, తండ్రి: షేక్ వాజీద్, వయస్సు: 21 సంవత్సరాలు, కులం: మిస్లిం, నివాసం: సారంగాపూర్, నిర్మల్ జిల్లా.

3.షేక్ ఆసిఫ్, తండ్రి: షేక్ వాజీద్, వయస్సు: 22 సంవత్సరాలు, కులం: మిస్లిం, నివాసం: సారంగాపూర్, నిర్మల్ జిల్లా.

4.ననిగంటి రాహుల్ రెడ్డి, తండ్రి: నరసింహ రెడ్డి, వయస్సు: 21 సంవత్సరాలు, కులం: రెడ్డి, నివాసం: సారంగాపూర్, నిర్మల్ జిల్లా.

5.భోదాసు శేఖర్, తండ్రి: ఎల్లయ్య, వయస్సు: 24 సంవత్సరాలు, కులం: వడ్డెర, నివాసం: సారంగాపూర్, నిర్మల్ జిల్లా.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ

మునిమాన్కల కాశన్న, సాయన్న, వ,,55 సం.లు, కులం: చాకలి, వృత్తి: కుల వృత్తి, ని,,సారంగాపూర్.లస్మవ్వ కొడుకు అయిన శివరాత్రి ధర్మరాజు మునిమన్కల కాశన్నను ఎలాగైనా చంపాలని ఉద్దేశంతో తాను వేసుకున్న ప్రణాళిక ప్రకారం తేది: 04-07-2026 రోజున రాత్రి అందాజ 07:00 గం. లకు మందుల కోసం మెడికల్ షాప్ కి ఒక్కడే నడుచుకుంటూ వెళ్తుండగా ధర్మరాజు మృతుడును వెంబడించి ఎవరు లేనిది చూసి కేదార్నాథ్ జిన్నింగ్ మిల్లు దగ్గర మృతుడును పట్టుకొని చేతులతో కడుపులో గుద్ది, అక్కడే ఉన్న కర్రతో కాళ్ల పైన కొట్టి అతని స్నేహితులు అయిన షేక్ అహ్మద్, షేక్ ఆసిఫ్, నానిగంటి రాహుల్ రెడ్డి, బోదాసు శేఖర్ లను పిలిపించుకొని అందరూ కలిసి చేతులతో కొట్టి క్రింద పడేసి కాళ్ళతో కొట్టినారు. అదే సమయంలో తన తమ్ముడు అయిన మునిమన్కల శ్రీనివాస్ తన బందువు అయిన మునిమనికల హరీష్ ను హరీష్ ఫ్రెండ్ అయిన త్రినేష్ లను వెంట పెట్టుకొని అక్కడికి వెళ్లేసరికి వాళ్ళను చూసి వారు పారిపోయినారు. కింద పడి ఉన్న మునిమన్కల కాశన్నను చికిత్స నిమిత్తము నిర్మల్ లోని దేవేందర్ రెడ్డి హాస్పిటల్ తీసుకు రాగా, మృతుడు కడుపులో చిన్న పేగు డ్యామేజి అయినది అని ఆపరేషన్ చేసినారు. మునిమన్కల కాశన్న(మృతుడు) చికిత్స పొందుతూ దేవేందర్ రెడ్డి హాస్పిటల్ లో తేది:18-07-2026 రోజున మధ్యాహ్నం 01:45 గం.లకు చనిపోయాడు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మల్ పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు మృతదేహాన్ని అప్పగించనైనది. నిందుతులైన శివరాత్రి ధర్మరాజు అతని స్నేహితులను అరెస్ట్ చేసారు.సారంగాపూర్ గ్రామం లో నిర్మల్ గ్రామీణ సి.ఐ కృష్ణ అధ్వర్యంలో సారంగాపూర్ పోలీసు సిబ్బంది అరెస్టు చేసినారు. ఈ సందర్భముగా నిర్మల్ డిఎస్పీ, గ్రామీణ సిఐ పోలీస్ సిబ్బందిని అభినందిచినారు.

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగా కంచం లక్ష్మణ్

పార్టీ పటిష్టతకు కృషి చేస్తా



**సిరికొండ, జూలై 19, (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ సిరికొండ మం డల అధ్యక్షుడుగా కంచం లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నియామకం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కు శాలువా కప్పి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లా డుతూ సిరికొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకం అయినందున నాకు మండల అధ్యక్షుల బాధ్యత అప్ప చెప్పినందుకు నా కర్తవ్య బా ధ్యతలు నిర్వర్తిస్తానని, నా వెంట పార్టీకి చెందిన సర్పంచ్ లని, నాయకులని, కార్య కర్తలని అందరిని, పాత, కొత్త, లేకుండా ప్రతి ఒక్కరిని తోడ్కోని పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని, జిల్లా నుండి ఏ నాయకుని పిలుపు వచ్చిన వెంటనే ఆకార్యక్రమం అమలు చేస్తానని అన్నారు. రెండు అసెంబ్లీ నియోజక వ్గాలకు ఉమ్మడిగా ఉన్న సిరి కొండ మండలం నుంచి బోథ్, ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురేసే బాధ్యతను మండల వాసులు తరపున భుజాన వే సుకుంటా నని అన్నారు. సిరి కొండ మండల అధ్యక్షులుగా అవకాశం కల్పించి న తెలంగాణ రాష్ట్ర ముఖ్య మం త్రి రేవంత్ రెడ్డికి, పీసీసీ అ ధ్యక్షులు బొమ్మే మహేష్‌కు మార్ గౌడ్ కి,నిర్మల్ డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ కి, ఆదిలాబాద్ డీసీసీ అధ్య క్షులు డా"నరేష్ జాదవ్,బో థ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, మాజీ ఎంపీ సోయం బాపూరావు కి,జిల్లా డీసీసీ ఉప అధ్యక్షులు జిల్లా సెక్రటరీలకు, మండల నూతన సర్పంచ్ లకు, ఉప స ర్పంచ్ లకు, మాజి జడ్పీటీ సీ, మాజి సర్పంచ్‌లు, మా జి ఎంపీ టీ సీలకు, మాజి మండల అధ్యక్షులకు, మార్కెట్ చైర్మన్ లకు, డైరక్టర్ లకు, సిరికొండ మండల ముఖ్య నాయకులకు, సార్మేడిలకు అన్ని గ్రామాల పటేల్ లకు, దేవరీలకు, మహాజన్‌లకు, బంజారా నాయక్‌లకు, కార్యకర్తల కు, ప్రజలకు, మహిళలకు నా తోటి యువతకు, ప్రతి ఒక్కరికి ఆయన ధన్య వాద ములు తెలిపారు. మండ లంలో పార్టీ పటిష్టతకు సహకరించాలని కోరారు.

## పోచమ్మ బోనాలు



**బోథ్, జూలై 19 (ప్రజా జ్యోతి)**మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో వర్షాలు కురవాలని పోచమ్మకు బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలు కురిసి ఊరంతా పచ్చని పైరులతో వర్ధిల్లాలని కోరుకున్నట్లుగా తెలిపారు. అలాగే సల్లంగా చూడాలని ఆ తల్లిని వేడుకున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమం లో రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రాయ్ పూర్ ఛత్తీస్ గఢ్ గోం డ్వానా గోండు జాతీయ మ హాసభలో పాల్గొన్న మాజీ ఎంపీ




**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 18, (ప్రజా జ్యోతి)** భారత దేశంలో ఉన్న ఆది వాసిల స్థితి గతులను, ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి అభివృద్ధికి తోడ్పడాలని, విద్యా, ఉద్యోగాలు, పరి శ్రమలు,భూమి తదితర అంశాలలో అభివృద్ధి చేయాలి డిమాండ్ చేస్తూ గోండ్వానా గోండు మహాసభ జాతీయ అధ్యక్షులు శిశు పాల్ సారీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాజ్ గోండు సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ సోయం బాపూరావు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసులకు, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, అటవీ శాఖ అధికారుల రెవెన్యూ భూ ముల సమస్యలు పరిష్క రించాలని, ఆదివాసి గిరిజ నులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్య క్రమంలో మంగం విషం రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ గోండు సేవా సమితి, కురిసెంగ తానాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంధూర్ మాధవ్, పెంధోర్ తదితరులు పాల్గొన్నారు.

## మాల కులస్తులకు ఇందిర మ్మఇళ్లు మంజూరు చేయాలి

మాల సంఘం జెఎసి కన్వీ నర్ రాజేశ్వర్



**ఇచ్చోడ, జూలై 19,( ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిర మ్మ ఇళ్ల మంజూరు లో పక్ష పాత వైఖరిని అవలంబి స్తోందని, మాలలను పూర్తిగా విస్మరిస్తోం దని, మాల సంఘం జేఏసీ కన్వీనర్ శాంతాపూర్ రాజేశ్వర్ ఆరోపించారు.అది లాబాద్ జిల్లా ఇచ్చోడ మండల మాలలకు, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, ఎవరికైనా, ఇంది రమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అచ్చే ఎలక్షన్లో, బుద్ధి చెబు తామని, మాల సంఘశీ జెఏసి కన్వీనర్, శాంతాపూర్ రాజేశ్వర్ అన్నారు. బత్తుల శివకుమార్, తోగరి రాజేశ్వర్, ఈదుల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# హై లోడ్ ఓవర్ హై స్పీడ్‌తో రోడ్లు అస్తవ్యస్తం

**అధిక ట్రాఫిక్ తో పాఠ శాల,విద్యార్థులకు, వృద్ధులకు,వాహన దారులకు,పాదచారు లకు, ఇబ్బందులు**

**భారీ వాహనాలకు దుబ్బగూడా బైపాస్ నుండి మళ్ళించాలని జిల్లా కలెక్టర్ కు ప్రజావాణి లో ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు స్పందించని జిల్లా అధికారులు**

**తమకు ఎలాంటి సంబంధం లేదని ఆర్ అండ్ బి అధికారులు:**

**చిన్న వాహనాదారు లను అధిక ఫైన్ లతో ఇబ్బంది పెట్టే ఆర్టీఓ, అనుమతి లేని అధిక లోడ్లతో వస్తున్న భారీ వాహనాలను:**

**గాలికి వదిలేసి తనిఖీ లు చెయ్యకుండా వారి తో డబ్బులు తీసుకుంటున్నారని గ్రామస్తుల ఆరోపణ:**

**ప్రజలతో కలిసి నిరసన చేస్తూ రోడ్డుపై ధర్నా ఆందోళన చేపట్టిన సర్పంచ్ ఒడ్డెట్టి నాగమణి,ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్, వార్డ్ మెంబర్ లు:**

**మద్దతు తెలిపిన, మాజీ సర్పంచ్ రామన్న బాబు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు షేక్ చాంద్**

**2 గంటలపాటు రెండు వైపులా కిలోమీటర్లు నిలిచిన వాహనాలు, స్తంభించి ట్రాఫిక్ కు అంతరాయం ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు**

**భారీ వాహనాలు సిర్పూర్(టి)లో ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలని పోలీసులతో వాగ్వివాదం:**

**జిల్లా అధికారులు, రావాలి,ఆర్టీఓ రావాలి, తాహసిల్దార్ రావాలి, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు రావాలని పట్టు, హోరెత్తించిన నినాదాలు:**

**ఆర్టీఓతో మాట్లాడి క్షేత్రస్థాయిలో సమస్యను పరిష్కరిస్తా మని ఆందోళన కారు లను నచ్చజెప్పి:**

**వాహనాలు స్తంభించ కుండా చర్యలు చేపట్టిన ఎస్సై సాగర్:**

**జూలై19,సిర్పూర్(టి) నియోజకవర్గ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని వెంకటరావుపేట గ్రామంలో నుండి సిర్పూర్(టి)లో వివిధ రాష్ట్రాల నుండి అనుమతి లేకుండా హై లోడ్ ఓవర్ హై స్పీడ్ తో వస్తున్న భారీ వాహనా

లు పాఠశాల విద్యార్థు లకు,వృద్ధులకు పాద చారులకు,చిన్న వాహన దారులకు ఇబ్బంది కరంగా మారి, ఎన్నో ప్రమాద ఘటనలు చోటు చేసుకుంటున్నా యని ఇలాంటి ఓవర్ లోడ్ హై స్పీడ్ తో వస్తున్నా వాహనాలతో రోడ్లు అస్తవ్యస్తంగా మారుతు న్నాయని, దుమ్ము ధూళితో మండల ప్రజలు ఊపిరితిత్తులు,శ్వాస కోశ, ఎలర్జీ వివిధ రకాల వ్యాధులతో అనారోగ్యం పాలవుతున్నారని, ఓవర్ లోడ్ హై స్పీడ్ తో అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాల నుండి వెంకటరావుపేట్ వయా సిరిపూర్ మీదుగా వస్తున్న భారీ వాహనాలను సిరిపూర్ (టి) ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, ఈ భారీ వాహనాలకు దుబ్బ గూడ బైపాస్ నుండి మళ్ళించాలని జిల్లా కలెక్టర్ సమీకృత కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో జిల్లా కలెక్టర్ కు ఎన్ని సార్లు ప్రజా ఫిర్యాదు చేసిన జిల్లా అధికారులు పట్టించు కోవడంలేదని ఆగ్రహంతో మండల ప్రజలు రోడ్డుపై నిరసన చేస్తూ ఆందోళన చేపట్టారు.ప్రజలతో పాటు సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచా యతీ సర్పంచ్ ఒడ్డేటి నాగమణి,ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్, వార్డ్ మెంబర్లు సాయి, అస్లంబిన్ అబ్దుల్లా, గణేష్,మోయిస్, ధర్నా చేపట్టారు.వీరికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు షేక్ చాంద్, మాజీ సర్పంచ్ రామన్న బాబు,అమీనుద్దీన్ మద్దతు తెలిపారు. రోడ్డుపై ధర్నా చేపట్టారు. జిల్లా అధికారులు రావాలి, ఆర్టీవో రావాలి, తాహసిల్దార్ రావాలి, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే రావాలి, రావాలని హోరెత్తించిన నినాదా లతో పట్టుపట్టారు. ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది.2గంటల పాటు రెండు వైపులా కిలోమీటర్ దూరంలో నిలిచిన భారీ వాహనాలు ట్రాఫిక్ స్తంభించి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, పోలీసులతో వాగ్వివాదం చేసిన ప్రజలు, గ్రామ పాలకులు నచ్చ చెప్పిన పోలీసులు పట్టు వీడని ప్రజలు, పాలకులు ఆర్టీఓ తో మాట్లాడి సమస్యను క్షేత్రస్థాయిలో పరిష్కరి స్తామని హామీ ఇచ్చిన ఎస్సై సాగర్ పట్టు విడవని ఆందోళన కారులతో పాటు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు షేక్ చాంద్, మాజీ సర్పంచ్ రామన్న బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమినుద్దీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అబ్దుల్ అఖిల్ గ్రామ పాలకులు వార్డ్ మెంబర్లతో కలిసి, సర్పంచ్ ఒడ్డేటి నాగమణి, ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్,

మాట్లాడుతూ... ఆర్ అండ్ బి అధికారులకు చెప్పిన మాకు ఎలాంటి సంబంధం లేదని, ఆర్టీఓ పర్యవేక్షణ కరువై, జిల్లా అధికారులు స్పందన లేక, మండల అధికారు లు పట్టించుకోక పోవడం తో మండల ప్రజల అవస్తులు అనారోగ్యం పాలు, సమస్యలు పట్టించుకునే నాధుడు లేక రోడ్డుపై అందోళన చేపట్టడం జరిగిందని అన్నారు. చిన్న చిన్న వాహన దారులను ఇబ్బంది పెట్టి అధిక ఫైన్ లు వేసి ఇబ్బంది పెట్టే ఆర్టీఓ పెద్ద వాహనాలను ఎందుకు గాలికి వదిలేసేయాలని నిలదీశారు. అధిక లోడ్ హై స్పీడ్ తో వస్తున్న భారీ వాహనాలతో ఒప్పందాలు కుదురుచుకొని పర్యవేక్షణ చేయకుండా డబ్బులు దండుకుంటు న్నారని ఆర్టిఓ పై ఆరోపణలు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య జటిలంగా మారడంతో రంగంలోకి దిగిన ఎస్సై సాగర్ అందోళన కారులతో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేయగా వినకుండా ఘటన స్థలంలో ఆర్టీవో జిల్లా అధికారులు రావాలని పట్టుపట్టారు. ఆర్టీవో తో మాట్లాడి భారీ వాహనాలు గ్రామంలో ప్రవేశ కుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టి సమస్యను క్షేత్రస్థాయిలో పరిష్కారిస్తామని,నచ్చ జెప్పడంతో ఆందోళనా లు విరమించారు. అనంతరం ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి వాహనాలు పంపించి ట్రాఫిక్ జాన్ కాకుండా వాహనాలు పంపించి ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

